జేఎన్‌టీయూహెచ్‌లో నేడు మెగా హెల్త్ క్యాంపు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 26 : జేఎన్‌టీయూహెచ్ వర్సిటీలో ఫ్రీ మెగా హెల్త్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు వర్సిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ శోభారాణి ఓ ప్రకటనలో తెలిపారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వర్సిటీ ఆవరణలోని హెల్త్ సెంటర్‌లో 27, 28 లలో ఫ్రీ మెగా హెల్త్ క్యాంపు కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని వర్సిటీ ఉద్యోగులు, సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫుట్‌పాత్, రోడ్డు ఆక్రమణల తొలగింపు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 26 : కేపీహెచ్‌బీ కాలనీ సర్వీస్‌రోడ్డు, గోపాల్‌నగర్ కాలనీలో రోడ్డు, ఫుట్‌పాత్ ఆక్రమణలపై జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు మూసాపేట సర్కిల్ టౌన్‌ప్లానింగ్, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసుల ఆధ్వర్యంలో గోపాల్‌నగర్ కాలనీలో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. అదే విధంగా కేపీహెచ్‌బీ కాలనీ సర్వీస్ రోడ్డులో నేతాజీ పార్కు పక్కన వెలసిన ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా సర్కిల్ అధికారులు మాట్లాడుతూ.. రోడ్డు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించడం వల్ల ట్రాఫిక్ సమస్యలతో పాటు పాదచారులు ఆ మార్గంలో నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయా ప్రాంతాల్లో గుర్తించిన ఆక్రమణలన్నింటిపై చర్యలు తీసుకుంటామన్నారు.

చేవెళ్లలో ఎగిరేది గులాబీ జెండానే..

- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కాసానిని భారీ మెజార్టీతో గెలిపిద్దాం..
- ఎన్నికల సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే గాంధీ పిలుపు

ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్, మార్చి 26: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్లలో ముచ్చటగా మూడోసారి ఎగురబోయేది గులాబీ జెండానేనని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేసి అధిక మెజార్టీ వచ్చేలా పాటుపడాలని పిలుపునిచ్చారు. చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు కోసం వివేకానందనగర్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే ఎన్నికల సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించారు. కార్పొరేటర్లు హమీద్ పటేల్, రాగం నాగేందర్‌యాదవ్, జూపల్లి సత్యనారాయణ, నార్నె శ్రీనివాస్ రావు , ఉప్పలపాటి శ్రీకాంత్ , మా జీ కార్పొరేటర్లు సాయిబాబా, రంగారావు, ఆయా డివిజన్‌ల పార్టీ అధ్యక్షులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వరాష్ట్ర అవతరణ అనంతరం చేవెళ్లలో ఇప్పటికి రెండుసార్లు గులాబీ జెండానే ఎగిరిందని, ప్రజల మద్దతుతో మూడో విజయాన్ని సైతం నమోదు చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే సర్కారుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొన్నదని, సాగు, తాగు సహా ఇతర రంగాలన్నో చతికిల పడుతున్నాయని అన్నారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ చేపట్టిన పథకాలు, కాంగ్రెస్ ,బీజేపీల వైఫల్యాలను ఓటర్లకు వివరిస్తూ వారి మద్దతును కూడగట్టాలని , జ్ఞానేశ్వర్‌ను అధిక మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలని, ప్రతి గడపకు వెళ్లి ఓటర్లను పలకరించాలని ఎమ్మెల్యే కోరారు. కేవలం మూడు నెలల వైఫల్య కాంగ్రెస్ పాలనతో విసిగిన ప్రజలు తొలి సీఎం కేసీఆర్ సుపరిపాలనను గుర్తు చేసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోహన్ గౌడ్, గణేశ్ ముదిరాజ్, సంజీవ రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, గౌతం గౌడ్, కిరణ్‌యాదవ్, రాజునాయక్, లక్ష్మీనారాయణ, భాస్కర్, హరీష్‌రావు, పెద్ద భాస్కర్‌రావు , లక్ష్మారెడ్డి, గంగాధర్, భిక్షపతి, రాజేందర్, వేణు , జిల్లా గణేశ్, కాశీనాథ్, రామకృష్ణగౌడ్, శ్రీనివాస్, చంద్రిక పాల్గొన్నారు.

- ముచ్చింతల్‌లోని సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి ఆధ్వర్యంలో 12వ శ్రీ విష్ణు సహస్రనామ సామూహిక మహా పారాయణంలో సీవీఆర్ చానల్ చైర్మన్ చలసాని వెంకటేశ్వర్‌రావు, ఖమ్మం కమ్మ సంఘం అధ్యక్షుడు రామారావులతో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మికత వెల్లి విరిసేలా సమతామూర్తి కేంద్రం విరాజిల్లుతున్నదన్నారు.

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు ఆహ్వానపత్రికను అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

సాయిబాబా విగ్రహాప్రతిష్ఠాపనకు ఆహ్వానం

కుత్బుల్లాపూర్, మార్చి 26 : జీడిమెట్ల డివిజన్, బ్యాంకుకాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన శిరిడీ సాయిబాబా విగ్రహాప్రతిష్ఠాపన వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని కోరుతూ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు మంగళవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిసి ఆహ్వానపత్రికను అందించారు. ఏప్రిల్ 4న జరిగే ఈ వేడుకలకు ఆలయ కమిటీ, బ్యాంకుకాలనీ సంక్షేమ సంఘం నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు కాలనీ అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, కార్యదర్శి క్రిష్ణగౌడ్, వెంకట్‌రెడ్డి, మోహన్‌రావు, ఎం.శ్రీనివాస రావు, పిఎస్.రమేశ్, సుబ్బరాయుడు, బసంత్, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నార్డ్ ఆంగ్లియా కాన్ఫరెన్స్‌లో ఓక్రిడ్జ్ ఉపాధ్యాయులు..

దుండిగల్, మార్చి 26: విద్యా ప్రమాణాలు పెంపొందించడం, వినూత్న బోధనా పద్ధతులను అన్వేషించడం కోసం వియత్నాంలోని హనోయిలో ఇటీవల జరిగిన నార్డ్ ఆంగ్లియా ఎడ్యుకేషన్ టీచింగ్ అండ్ లెర్నింగ్ కాన్ఫరెన్స్‌లో బాచుపల్లి (బౌరంపేట్)లోని ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన ఫ్యాకల్టీ ప్రముఖపాత్ర పోషించినట్లు పాఠశాల యాజమాన్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ప్రతిష్ఠాత్మక గ్లోబల్ ఈవెంట్‌కు పదిహేను దేశాల నుంచి రెండు వందల మందికి పైగా విద్యావేత్తలు హాజరు కాగా..అధ్యాపకులు, అభ్యాసకులు,సాంకేతిక ఏకీకరణ, విచారణ ఆధారిత అభ్యాస వాతావరణాలు పెంపొందించడంపై చర్చించారు. అత్యాధునిక పద్ధతులపై మాట్లాడారు. పాఠశాల ప్రిన్సిపాల్ బల్జిత్ ఒబెరాయ్ ఎడ్యుకేషనల్ లీడర్‌షిప్, ఇన్నోవేషన్‌పై వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో నోర్డ్ ఆంగ్లియా ఎడ్యుకేషన్ చీఫ్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ డాక్టర్ ఎలిస్ ఎకోఫ్, ఇంటర్నేషనల్ కరికులం హెడ్ అనురాధ, యూనిట్ కో-ఆర్డినేటర్ శోభాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నార్డ్ ఆంగ్లియా కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు

వైభవంగా శ్రీ జమదగ్ని -రేణుక ఎల్లమ్మ తల్లి కల్యాణం



హఫీజ్‌పేట్ డివిజన్, హుడా కాలనీలో శ్రీ జమదగ్ని రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో మంగళవారం నిర్వహించిన అమ్మవారి కల్యాణ మహోత్సవానికి హాజరై అమ్మవారిని దర్శించుకుంటున్న స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు
– మాదాపూర్, మార్చి 26

యుక్త వయస్సు పిల్లల ఎదుగుదలలో పౌష్టికాహారమే కీలకం

సిటీబ్యూరో, మార్చి 26 (నమస్తే తెలంగాణ): పిల్లల ఎదుగుదలలో పౌష్టికాహారం ఎంతో అవసరమని, ముఖ్యంగా యుక్తవయస్సుకు వచ్చిన పిల్లల ఆరోగ్యానికి పౌష్టికారమనేది చాలా కీలకమని నిలోఫర్ దవాఖాన యువ విభాగాధిపతి, ఎడోలెసెంట్ హెల్త్ అకాడమి ఐఏపీ హైదరాబాద్ అసోసియేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రమేశ్‌బాబు దాంపురి అన్నారు. నిలోఫర్ యువ విభాగం, ఏహెచ్ఏ ఐఏపీ సంయుక్తాధ్వర్యంలో మంగళవారం కూకట్‌పల్లిలోని శ్రీవిద్యా హైస్కూల్‌లో 'యుక్తవయస్సు పిల్లల్లో వచ్చే అనారోగ్య సమస్యలు, నివారణ మార్గాల'పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా.రమేశ్ దాంపురి మాట్లాడుతూ.. యుక్తవయస్సు పిల్లల్లో ముఖ్యంగా బాలికల్లో వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం ఎంతో ముఖ్యమన్నారు. యుక్తవయస్సు పిల్లల్లో ఎక్కువగా రక్తహీనత సమస్య కనిపిస్తుందని.. దీనిని గుర్తించి, తగిన చికిత్సతోపాటు సరైన పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ వయస్సు పిల్లలు ఎక్కువగా వత్తిడికి, ఆంగ్జైటికి గురయ్యే అవకాశాలు ఉంటాయన్నారు. అందుకని ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యం, వారి ప్రవర్తనపై దృష్టి పెట్టాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

గెలుపుకోసం అంకితభావంతో పని చేయాలి

దుండిగల్, మార్చి 26 : త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల సన్నాహక సమావేశం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి,బహదూర్‌పల్లిలోని మేకల వెంకటేశం ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మంత్రి తుమ్మల, ఎంపీ అభ్యర్థి పట్నం సునీత, హరివర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

శస్త్ర చికిత్స వివరాలను వెల్లడిస్తున్న వైద్యులు

విజయవంతంగా శస్త్ర చికిత్స..

కొండాపూర్, మార్చి 26 : తీవ్రమైన స్కోలియోసిస్ (పార్శ్వ గూని), న్యూరోఫైబ్రోమాటోసిస్ టైప్ 1తో బాధపడుతున్న బాలికకు అరీట్ దవాఖాన వైద్యులు మెరుగైన వైద్యం చికిత్సనందించారు. శస్త్ర చికిత్సకు సంబంధించిన వివరాలను మంగళవారం దవాఖానలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైద్య బృందం వెల్లడించింది. వెన్నెముక వక్రతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న 12 ఏండ్ల బాలిక అరీట్ దవాఖానలో చేరింది. వెన్నెముక శస్త్ర చికిత్స విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ వెంకట రామకృష్ణ బృందం బాలికకు పరీక్షలు నిర్వహించి స్కోలియోసిస్‌గా గుర్తించారు. వెంకట రామకృష్ణ ఆధ్వర్యంలో బృందం 11 గంటల పాటు శ్రమించి శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు.

పీహెచ్‌డీ ఫీజు పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 26: ఓయూలో పీహెచ్‌డీ కోర్సుల ఫీజు పెంపు నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్‌ను కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య మాట్లాడుతూ.. 2022-23 విద్యా సంవత్సరానికి రూ.2వేలున్న ఫీజును ఎలాంటి హేతుబద్ధత లేకుండా ఆర్ట్స్, సోషల్‌సైన్స్, కామర్స్, మేనేజ్‌మెంట్, లా, ఎడ్యుకేషన్ విభాగాలకు రూ.20వేలు, ఇతర విభాగాలకు రూ.25వేలకు పెంచారని చెప్పారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఏడాది కాలంగా పరిశోధక విద్యార్థులు నిరసనలు చేశారని గుర్తు చేశారు. ఫీజుల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడంలో అధికారులు జాప్యం చేశారని ఆరోపించారు. ప్రస్తుతం తమ వినతిపై అధికారులు సానుకూలంగా స్పందించారని.. వచ్చేనెల 23న జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశంలో అన్ని విభాగాల డీన్లతో మాట్లాడి ఫీజుల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటామని హామీ ఇచ్చారని అన్నారు.

సీసీ రోడ్డుపైనే నిర్మాణం..అడ్డుకున్న స్థానికులు

దుండిగల్, మార్చి26: ఎన్నికల విధుల పేరుతో అధికారులు క్షేత్రస్థాయి అభివృద్ధి పనులను పర్యవేక్షించకుండా.. తమ కింద పనిచేస్తున్న వర్క్‌ఇన్‌స్పెక్టర్‌లకు అప్పగిస్తుండటం కాంట్రాక్టర్లకు వరంగా మారింది. ఇందుకు దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, బహదూర్‌పల్లిలోని శ్రీరాంనగర్ గడ్డ వద్ద జరుగుతున్న సీసీ రోడ్డు పనులే నిదర్శనం. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి,15వ వార్డు,శ్రీరాంనగర్‌గడ్డ బస్తీలో గతంలో సీసీ రోడ్లు ఏర్పాటు చేశారు.అయితే ఇటీవల ఇంటింటికి గోదావరి జాలాల కోసం సంబంధిత రోడ్డును తవ్వడంతో ఛిద్రమైంది. ఇందుకోసం రూ.5లక్షల మున్సిపాలిటీ నిధులతో ఎర్త్‌వర్క్ పనులను గుత్తేదారుకు అప్పగించారు. ఈ నేపథ్యంలో మంగళవారం గుత్తేదారు పనులను మొదలు పట్టారు. నిబంధనల ప్రకారం ... గతంలో వేసిన సీసీని తొలగించి, తిరిగి నిర్మించాలి. అయితే సంబంధిత కాంట్రాక్టర్ అలా చేయకుండా గతంలో ఉన్న సీసీ రోడ్డుపైనే కొద్దిగా కంకర, డస్ట్‌వేసి పనులు చేపడుతుండగా స్థానికులు అడ్డుకున్నారు. తమ బస్తీలో నాసిరకం పనులు చేయవద్దని, నిబంధనలు ఎలా ఉంటే అలా చేయాలని పట్టుపట్టడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. ఇదే విషయమై మున్సిపాలిటీ కమిషనర్ సత్యనా రాయణరావును 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

సీసీ రోడ్డుపైనే మళ్లీ సీసీరోడ్డు వేసేందుకు కంకర, డస్ట్‌ను పరిచిన దృశ్యం

వ్యభిచార గృహంపై దాడి

ఇద్దరు విటులు, సూపర్‌వైజర్ అరెస్ట్

మాదాపూర్, మార్చి 26: వ్యభిచార గృహంపై దాడి చేసిన పోలీసులు గెస్ట్ హౌస్ సూపర్‌వైజర్‌తో పాటు ఇద్దరు విటులను అరెస్ట్ చేశారు. ఈ సంఘటన మంగళవారం మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం ... మాదాపూర్‌లోని కాకతీయ హిల్స్ రోడ్డు నంబర్1లో ఉన్న గెస్ట్ హౌస్‌లో వ్యభిచారం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు ఆ గెస్ట్ హౌస్‌పై దాడి చేశారు. బిహార్‌కు చెందిన గెస్ట్ హౌస్ సూపర్‌వైజర్ పల్తు పాశ్వాన్‌తోపాటు బిహార్‌కు చెందిన ఇద్దరు విటులను అదుపులోకి తీసుకొని ఇద్దరు బాధిత మహిళలను రక్షించారు. ఇదిలా ఉండగా మరో నిర్వాహకురాలు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ. 56 వేల నగదు, 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 26 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో మంగళవారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) కింది విధంగా ఉన్నాయి.

టమాట కిలో రూ.13, వంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 55, బజ్జి మిర్చి 40, కాకరకాయ 35, బీరకాయ 35, క్యాబేజి 19, ఫ్రెంచ్ బీన్స్ 55, క్యారెట్ 19, కాలీఫ్లవర్ 18, దొండ 18, చిక్కుడు 48, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 19, క్యాప్సికం 70, ఆలుగడ్డ 25, కీరా 25, దోసకాయ 18, సొరకాయ 9, పొట్లకాయ (1) 18, కందగడ్డ 60, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 24, మామిడికాయ(1) 10 నుంచి 15, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 40, ముళ్లంగి (1) 4 నుంచి 6, మొరంగడ్డ 19, గుమ్మడికాయ 40, నిమ్మకాయలు(12) 55 నుంచి 60, మునగకాయ(1) 5 నుంచి 6, పచ్చి బఠానీ 55, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 200, అల్లం 160, వెల్లుల్లి 180, చింతపండు 140 గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

వందశాతం స్వచ్ఛత సాధించడమే లక్ష్యంగా..

- రోడ్ల పక్కన, ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేస్తున్న ప్రాంతాల గుర్తింపు
- తొలగింపు దిశగా జీహెచ్ఎంసీ అధికారుల కార్యచరణ ..
- కూకట్‌పల్లి జంట సర్కిళ్లలో 242కు పైగా జీవీపీలు
- ఇటీవల తొలగించినవి 78 .. తొలగించాల్సినవి 164



కూకట్‌పల్లి సర్కిల్‌లో జీవీపీలను తొలగించే అవగాహన కార్యక్రమంలో బృందాలు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 26 : వందశాతం స్వచ్ఛతను సాధించడమే లక్ష్యంగా జీహెచ్ఎంసీ ప్రత్యేక కార్యచరణను చేపట్టింది. కాలనీలు, బస్తీల్లో నివసించే ప్రజలనుంచి ప్రతిరోజూ స్వచ్ఛ ఆటోలతో వ్యర్థాలను సేకరించే కార్యక్రమం నిర్విరామంగా చేపడుతున్నా.. ఖాళీ ప్రదేశాలు, రోడ్ల పక్కన చెత్త కుప్పలు దర్శనమిస్తూనే ఉన్నాయి. చిన్నచిన్న తోపుడుబండ్లపై వ్యాపారాలు చేసేవారు వ్యర్థాలను స్వచ్ఛ ఆటోల్లో వేయకుండా రోడ్ల పక్కన, ఖాళీ ప్రదేశాల్లో పడేస్తున్నారు. మరికొందరు రాత్రి వేళల్లో చెత్త కవర్లను తీసుకొచ్చి రోడ్డు పక్కన పడేస్తున్నారు. ఇలా తరచుగా చెత్త వేసే ప్రాంతాలు (జీవీపీ) రోజురోజుకూ పెరుగుతుండటంతో జీహెచ్ఎంసీ అధికారులు వీటిని తొలగించే దిశగా కార్యచరణ రూపొందించారు. గతంలో పలుమార్లు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టినా జీవీపీలను తొలగించడంలో విఫలమైన అధికారులు ఈసారి పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు.

164 జీవీపీలను తొలగించేలా..

కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల పరిధిలో తరచుగా చెత్తవేసే ప్రాంతాలు (జీవీపీ)లు 242కు పైగా ఉండేవి. మూసాపేట సర్కిల్‌లో 130, కూకట్‌పల్లి సర్కిల్‌లో 112 జీవీపీలను గుర్తించారు. గత కొన్ని రోజులుగా జీవీపీలను తొలగించే పనులపై దృష్టిసారించిన జీహెచ్ఎంసీ యంత్రాంగం.. ఇప్పటి వరకు 78 జీవీపీలను మాత్రమే తొలగించారు. వీటిలో మూసాపేటలో 49, కూకట్‌పల్లిలో 29 ఉన్నాయి. ఇంకా మూసాపేటలో 81, కూకట్‌పల్లిలో 83 జీవీపీలు కలుపుకుని రెండు సర్కిళ్లలో కలిపి 164 జీవీపీలను తొలగించాల్సి ఉంది. ఆ దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ప్రజలకు అవగాహన..

కాలనీలు, బస్తీల్లో గుర్తించిన జీవీపీలను తొలగించేందుకు వారం రోజుల కార్యచరణను చేపట్టారు. మొదటిరోజు కాలనీ, బస్తీ కో ఆర్డినేషన్ కమిటీ మీటింగ్‌లో ఎస్ఎఫ్ఏ, ఎస్ఏటీ ఆటో డ్రైవర్, ఎస్ఎల్ఎఫ్ సభ్యులు, వార్డుస్థాయి కో ఆర్డినేటర్ (సీవో)లతో కలిసి చెత్త సేకరణ ప్రాంతాలను గుర్తించాలి. రెండో రోజు స్వచ్ఛ ఆటోలకు ట్యాగ్ చేయని గృహాలను గుర్తించి వారిని స్వచ్ఛ ఆటోలోనే చెత్త వేసేలా అవగాహన కల్పించారు. మూడోరోజు కాలనీలు, బస్తీల్లో అవగాహన ర్యాలీలు చేపట్టాలి. నాల్గవరోజు స్వచ్ఛ ఆటోల్లో చెత్త వేయనివారిని గుర్తించి.. వారి ఇంటిముందు అవగాహన కార్యక్రమం చేపట్టడం. ఐదోరోజు తొలగించిన జీవీపీ పాయింట్ల వద్ద రంగోలి కార్యక్రమాలను నిర్వహించడం. ఆరోరోజు టౌన్‌వెండింగ్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి వారంతా చెత్త వ్యర్థాలను స్వచ్ఛ ఆటోల్లో వేసేలా చూడడం. ఏడోరోజు ప్రతిజ్ఞ, తీర్మానం కార్యక్రమాలను చేపట్టాల్సి ఉందని జంట సర్కిళ్ల ఏఎంహెచ్‌వోలు సాల్మాన్‌రాజ్, మమతలు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో కార్మికుడు మృతి

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 26 : ఓ వస్త్ర దుకాణం షెట్టర్‌కు మరమ్మతులు చేస్తుండంగా విద్యుత్ షాక్‌కు గురైన ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలానగర్‌కు చెందిన పవన్ (35) కేపీహెచ్‌బీ కాలనీ మొదటి రోడ్డులోని ఐరీష్ వస్త్ర దుకాణంలో షెట్టర్‌కు మరమ్మతు పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఇనుప కడ్డీల పైకిఎక్కి పనులు చేస్తుండగా ప్రమాదశాత్తు విద్యుత్ తీగలకు తగిలి షాక్‌కు గురై కిందపడ్డాడు. వెంటనే అతడిని వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్, మార్చి 26 : ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్ఐ సురేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... జీడిమెట్ల డివిజన్, ఎంఎన్‌రెడ్డినగర్ ఫేస్-2 కాలనీకి చెందిన పినాటి వెంకటశివాజీ(38) ..భార్య, ఇద్దరు కొడుకులతో కలిసి నివాసం ఉంటున్నాడు. కుటుంబ అవసరాల కోసం కరోనా సమయంలో చేసిన అప్పులు తీర్చలేక నిత్యం మనోవేదనకు గురయ్యేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇద్దరు కొడుకులు పడుకోగా.. రాత్రి 10.30 గంటల సమయంలో భార్యతో కలిసి ఆరుబయట మాట్లాడి .. ఇప్పుడే వస్తానని చెప్పి వెళ్లి డోర్ పెట్టుకొని చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకొన్నాడు. వెంటనే అతని భార్య వెళ్లి డోర్ తీయాలని బెల్ కొట్టినా సమాధానం రాకపోవడంతో కిటికీలో నుంచి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి తలుపులు పగు లగొట్టి బయటకు తీయగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సవాళ్ల పరిష్కారానికి సహకారం అవసరం

మహీంద్ర యూనివర్సిటీ టీఈడీఎక్స్ ఈవెంట్‌లో వక్తల ఉద్ఘాటన

మహీంద్ర యూనివర్సిటీలో జరిగిన టీఈడీఎక్స్ పాల్గొన్న వక్తలు

దుండిగల్, మార్చి 26 : ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి సహకారం అవసరమని బియాండ్ బౌండరీస్ ఇంటర్ డిసిప్లినరీ సొల్యూషన్స్ ఫర్ గ్లోబల్ ఛాలెంజెస్ అనే థీమ్‌తో మహీంద్రా విశ్వవిద్యాలయం టీఈడీఎక్స్ ఇటీవల నిర్వహించిన ఈవెంట్‌లో వక్తలు ఉద్ఘాటించారు. ఈ ఈవెంట్‌కు ప్రపంచంలోని పలు సమస్యలపై వినూత్న విధానాలను అన్వేషించడానికి విభిన్న శ్రేణి స్పీకర్లు హాజరయ్యారు. టీఈడీఎక్స్ మహీంద్రా విశ్వవిద్యాలయం.. ఆలోచనాపరులు, కలలు కనేవారు, నాయకులు, వివిధ రంగాలకు చెందిన ఆవిష్కర్తలు, ధృక్కోణాలను పంచుకోడానికి ఒక వేదికగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డ్రైవ్ ఆన్ మై ఓన్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ అనితాశర్మ, టెక్ మహీంద్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజేశ్ దుద్దు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో మాదిగలకు అన్యాయం

చింతా భగవాన్ ప్రసాద్

ఖైరతాబాద్, మార్చి 26 : కాంగ్రెస్ పాలనలో మాదిగలకు న్యాయం జరుగడం లేదని నేషనల్ ఇంటలెక్చువల్ ఫోరం ఫర్ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యక్షుడు చింతా భగవాన్ ప్రసాద్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 80 లక్షల మంది దళిత జనాభా ఉంటే అందులో 62 లక్షల మంది మదిగలే ఉన్నారన్నారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్